క్లుప్తంగా

ధనమ్మ మర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలో వెలసిన ధనమ్మ తల్లి మర్రికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆదివారం సెలవు దినం కావడంతో విద్యార్థులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు అమ్మవారిని దర్శించుకున్నారు. గోదావరి గట్టున, ఉద్యాన పంటల ఆవరణలో సరదాగా గడిపారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

కొబ్బరిచెట్ల ఫలసాయానికి నేడు వేలం

కపిలేశ్వరపురం: మండలంలో అంగర పీహెచ్‌సీ ఆవరణలోని 1.4 ఎకరాల ఖాళీ స్థలం, 30 కొబ్బరి చెట్లను సాగు చేసుకుని ఫలసాయం పొందే నిమిత్తం సోమవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు వైద్యాధికారి పి.రత్న కుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆవరణలో సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలంలో ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనవచ్చన్నారు. మూడేళ్ల పాటు సాగు షరతుపై నిర్వహించే వేలంలో పాల్గొనే వారు నిర్దిష్ట సమయానికి ఒక గంట ముందు ఆధార్ కార్డును చూపించాల్సి ఉంటుందని వైద్యాధికారి తెలిపారు.

శిథిలావస్థలో వంతెన



వత్రపూడిలో శిథిలావస్థకు చేరిన వంతెన

కె.గంగవరం: మండలంలోని అద్దంపల్లి–వత్రపూడిలో రహదారిలోని వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ రహదారిని నిత్యం వందలాంది మంది ప్రజలు ఉపయోగించుకుని అటు కాజులూరు మండలం, ఇటు కె.గంగవరం మండం, ద్రాక్షారామలకు చేరుకుంటారు. ఈ రహదారిలో వంతెన శిథిలావస్థకు చేరడంతో పాటు ఇరువైపులా రక్షణ గోడలు కూడా శిథిలావస్థకు చేరి పడిపోయాయని స్థానికులు అంటున్నారు. రక్షణ గోడలు లేక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని వారు చెబుతున్నారు. వంతెన కూడా పెచ్చులూడి పడిపోతుందని అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాజులూరు: కాకినాడ–కోటిపల్లి రహదారిలో కాజులూరు మండలం ఆర్యావటం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. కాకినాడ సూర్యనారాయణపురానికి చెందిన పున్నాని పనసరాముడు తన బైక్‌పై ద్రాక్షారామ వెళ్లి తిరిగి వస్తున్నారు. ఆర్యావటం వాటర్‌ట్యాంక్ వద్దకు వచ్చేసరికి రోడ్డుపై నడిచి వెళ్లుతున్న ఒక వ్యక్తి అడ్డుగా రావటంతో షడన్‌బ్రేక్ వేశాడు. బైక్ పల్టీలు కొట్టడంతో పనసరాముడు గాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి గాయాలపాలైన అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బలరామావతారంలో శ్రీవారు



బలరామావతారంలో శ్రీవారు

రాయవరం: స్థానిక శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారు ఆదివారం బలరామావతారంలో దర్శనమిచ్చారు. వేంకటేశ్వర భక్తజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న దశావతార మహోత్సవాల్లో భాగంగా స్వామివారిని బలరామావతారాల్లో అలంకరించారు. ఆలయ అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దశావతార మహోత్సవాల్లో రాయవరం పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పోస్టల్ ఉద్యోగికి చిరు సత్కారం



పోస్టల్ ఉద్యోగిని సన్మానిస్తున్న ఈదా ఫౌండేషన్ చైర్మన్ శామ్యూల్ రెడ్డి

మండపేట: స్థానిక తపాలా కార్యాలయంలో పోస్టల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కొండపల్లి సూర్యనారాయణకు ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ ఈదా శామ్యూల్‌రెడ్డి చిరుసత్కారం చేశారు. స్థానిక గొల్లపుంత రోడ్డు వైఎస్సార్ కాలనీలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు సూర్యనారాయణ హాజరయ్యారు. పోస్టల్ శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలకు గాను ఆయనను ఘనంగా సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి కూడా కొండపల్లి సేవలను కొనియాడుతూ పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. గుంటూరు అంతర్జాతీయ ప్రసంగీకులు బిషప్ ఎం. శామ్యూల్, విశ్వాసులు పాల్గొన్నారు.

మురుగు పోయేదెలా?

- గడ్డి, పిచ్చిమొక్కలతో పెరిగిన పూడిక
- నీటి ప్రవాహానికి ఆటంకం
- వెదజల్లిన పొలాల్లో నీరు నిలిచి రైతుల ఆందోళన



మొగలిపాలెం వద్ద పూడికతో నిండిపోయిన కూరాడ డ్రెయిన్

కాజులూరు: వ్యవసాయ సేద్యంలో పొలాలకు సాగునీరందించే పంట కాలువలు ఎంత ముఖ్యమో పొలాల్లోని మురుగునీటిని బయటకు తరలించే డ్రెయిన్లు, మురుగుకాలువలు అంతే ముఖ్యం. అయితే తూటుకాడ, గుర్రపుడెక్కలతో డ్రెయిన్లలో పూడికలు పెరిగిపోయి నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురికావలసి వస్తుంది. నియోజకవర్గ గ్రామాల్లో రైతులు ప్రస్తుతం పంటదమ్ములు పూర్తి చేసుకుని నారుమడులు, వెదచల్లికల పనిలో ఉన్నారు. నారుమడులు, వెదజల్లికలకు నానబెట్టి మండీకట్టిన విత్తనాలను పొలంలో జల్లి నీరు తీసివేస్తారు. తడి, పొడి పదును బురదపైనే గింజ మొలకలు వచ్చి వేరు నాటుతుంది. గింజ వేరునాటే సమయంలో పొలంలో నీరు నిలిస్తే మొక్క మొలవకుండా గింజ కుళ్లిపోతుంది. మండల గ్రామాల్లోని వరి పొలాలు తూర్పు డెల్టా కాలువ శివారున ఉన్నాయి. ఎగువ ప్రాతం నుంచి ప్రవహించే ప్రధాన డ్రెయిన్లన్నీ మండల గ్రామాల మీదుగా ప్రవహిస్తూ కోరంగి మడఅడవుల మీదుగా సముద్రంలో కలుస్తుంటాయి. మండలంలోని టేకి, తుల్యభాగ, ఆత్రేయ గోదావరి, కూరాడ తదితర ప్రదాన డ్రెయిన్లతో పాటు తేనెలగొంది, శీల డ్రెయిన్, రాజు డ్రెయిన్, టి.మామిడాడ, వజ్ర కాలువ, దుగ్గుదుర్రు తదితర మైనర్ డ్రెయిన్లు పూడికలు పెరిగిపోయి ఉన్నాయి. దీంతో ఎగువ నుంచి వచ్చిచేరే మురుగునీరు ఇక్కడ డ్రెయిన్ల వెంబడి ఉన్న పొలాలను ముంచెత్తుతుంది. పొలాల్లో చేరుతున్న మురుగునీరు రోజుల తరబడి ఉండిపోవటంతో వెదచల్లిన పొలాల్లో విత్తనాలు మొలకలు రాకుండా కుళ్లిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా మండలంలోని కూరాడ డ్రెయిన్ పరిస్థితి మరీ ఆందోళనకరంగా మారింది. ఈ డ్రెయిన్ రామచంద్రపురం, కరప మండల గ్రామాల నుంచి ప్రవహిస్తూ మండలంలోని ఆర్యావటం, గొల్లపాలెం, మొగలిపాలెం, శలపాక, మీదుగా తణుకువాడ వద్ద తుల్యభాగ డ్రెయిన్‌లో కలసి సముద్రంలో చేరుతుంది. టి.మామిడాడ, మతుకుమిల్లి, బందనపూడి, ఆర్యావటం, మంజేరు, కరప మండలం పెద్దాపురప్పాడు గ్రామాల్లోని సుమారు 15 వేల ఎకరాల్లోని మురికి నీరు, ముంపునీరు డ్రెయిన్ ద్వారా బయటకు వెళుతుంది. డ్రెయిన్ పొడవునా గుర్రపుడెక్క, తూటుకాడ పెరిగిపోయి నీటిప్రవాహానికి అవరోధంగా మారటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధిత రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయిన్లను శుభ్రం చేయించి పూడికలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

గింజ మొలవడం లేదు



డ్రెయిన్ల వెంబడి వెదచల్లిన పొలాల్లో నీరు నిలిచిపోతుండటంతో గింజ మొలవడం లేదు. రెండూ లేక మూడేసి సార్లు విత్తనాలు చల్లుకోవలసి వస్తుంది. దీంతో దాళ్వా సాగుకు తీవ్రజాప్యం జరిగి చివరి దశలో సాగునీటి ఎద్దడికి గురి కావలసి వస్తుంది. మరోపక్క తరచూ విత్తనాలు చల్లాల్సి రావడంతో విత్తన కొరత ఏర్పడుతుంది.

– ఎస్.బులివెంకటరెడ్డి, రైతు, బందనపూడి

తీవ్రంగా నష్టపోతున్నాం



పూడుకుపోయిన డ్రెయిన్ల కారణంగా డెల్టా ప్రాంతంలోని రైతులు తీవ్రంగా నష్టపోవలసి వస్తుంది. మురుగునీరు ముందుకు పారకపోవటంతో పంట చేతికందే సమయానికి తుపాన్లు ముంచెత్తుతుండగా, నారుమడుల సమయంలో గింజ మొలవక నష్టపోవాల్సి వస్తోంది.

– నల్లమిల్లి చంద్రారెడ్డి, రైతు, మొగలిపాలెం

రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

కాజులూరు: గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఒంటితాడిలో ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయని ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు మధ్యలో పెద్ద, పెద్ద గోతులు ఏర్పడ్డాయన్నారు. వర్షాల సమయంలో గోతులలో నీరు నిలిచిపోయి సైకిళ్లు, మోటారుసైకిల్ వంటి వాహనాలు వేగంగా వచ్చి ప్రమాదాల పాలవుతున్నారన్నారు. ఆటో, ట్యాక్సీ వంటి వాహనాలు సైతం గోతులు దాటి వెళ్లేందుకు వీలు లేకుండా ఉందని అధికారులు, పాలకులు స్పందించి వెంటనే గ్రామీణ రహదారుల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మండల సీపీఎం నాయకులు కురుపూడి భూచక్రం, పెంకే రవితేజ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



డి.సురేష్‌బాబు

రాయవరం: నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని రాయవరం ఎస్సై డి.సురేష్ బాబు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన సంవత్సర వేడుకలను బహిరంగ ప్రదేశాల్లో జరుపుకోవడం నిషేధమన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అర్ధరాత్రి రహదారిపై కేకులు కట్ చేయడం, సైలెన్సర్ తీసి మోటారు వాహనాలు నడపడం, గుంపులుగా చేరి రోడ్లపై అల్లరి చేయడం వంటివి ఎవరు చేసిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 31వ తేదీ సాయంత్రం నుంచి మండలంలోని అన్ని ప్రధాన కూడళ్లలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని, కుటుంబ సభ్యులను క్షోభకు గురిచేయవద్దని ఆయన సూచించారు.

పందుల స్వైరవిహారాన్ని అరికట్టాలి



ఆర్యావటం రోడ్డుపై సంచరిస్తున్న పందులు

కాజులూరు: మండలంలోని ఆర్యావటంలో రోజురోజుకి పెరుగుతున్న పందుల స్వైరవిహారాన్ని అరికట్టేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పందుల సంచారం ద్వారా ప్రమాదకరమైన అంటువ్యాధులు సోకుతాయని వైద్యులు సూచిస్తున్నప్పటికీ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో పెంపకందార్లు విచక్షిణారహితంగా వాటి సంఖ్యను పెంచుతూ గ్రామంలోకి వదులుతున్నారు. అవి డ్రైనేజీల్లో పొర్లుతూ పరిసరాలను అస్తవ్యస్తం చేస్తున్నాయి. దీంతో భరించలేని దుర్వాసనలు వస్తూ ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పందుల పెంపకాన్ని నిరోధించాలని గ్రామానికి చెందిన పలువురు డిమాండ్ చేస్తున్నారు.

శంఖారావానికి అల్లూరి వేషధారణలో పాదయాత్రగా..



అల్లూరి సీతారాజు వేషధారణలో ప్రచారం పాదయాత్ర చేస్తున్న సోమేశ్వరం గ్రామస్తుడు

మండపేట: విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడ సమీపంలోని కేసరపల్లిలో నిర్వహించే హైందవ శంఖారావం విజయవంతం కావాలని కోరుతూ రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన యువకుడు అల్లూరి సీతారామరాజు వేషధారణలో పాదయాత్ర చేపట్టాడు. ఆదివారం రామచంద్రపురంలో ప్రారంభించిన ఈ పాదయాత్ర సాయంత్రానికి మండపేట చేరుకొంది. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి అయినవిల్లి రాజరాజేశ్వర రుద్రశర్మ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీవీ సాయిరాం స్వాగతం పలికారు. కార్యక్రమంలో పరిషత్ కార్యకర్తలు పేకేటి కిషోర్, నాళం ఫణి ప్రకాష్, సాంబశివరావు, చక్రవర్తి, కోటిపల్లి కృష్ణ, వెత్సా ప్రసాద్, శ్రీనివాస రెడ్డి, యల్లాజి పాల్గొన్నారు.

6,340 హెక్టార్లలో వరిసాగు



అముజూరులో వెదజల్లు సాగుకు సిద్ధం చేసిన పంట పొలం

కె.గంగవరం: మండల వ్యాప్తంగా 6,340 హెక్టార్లలో ఈ రబీ సీజన్‌లో రైతులు వరి సాగు చేసేందుకు రైతులు సమాయత్తమయ్యారు. మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఏఓ బలుసు రవి పర్యటించి వెదజల్లు, నాట్లు వేయడంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 800 హెక్టార్లలో వెదజల్లడం పూర్తయిందని 15 హెక్టార్లలో నాట్లు వేయడం జరిగిందన్నారు. జనవరి మొదటి వారం లోపు 90 శాతం పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసి వెదజల్లుకోవాలని తద్వారా భూమి ద్వారా వచ్చే తెగుళ్ల రాకుండా నాటిన 40 రోజుల వరకు ఆరోగ్యకరంగా పంట ఉంటుందన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని రైతులు అధికంగా ఎరువులు, పురుగు మందులు వాడడం మానేయాలని సూచించారు.

డిబేట్‌కు మేము సిద్ధం..

- వేదిక మీరు చెబుతారా..మేం చెప్పాలా..
- ఎంపీ బోస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బోస్, సర్పంచ్ సతీష్‌కుమారి

రామచంద్రపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో అవినీతి జరిగిందని, ఆ అవినీతిలో తనకూ వాటాలు ఉన్నాయని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆరోపణలు చేశారని, దీనిపై ఎక్కడైనా డిబేట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారా.. అన్న సుభాష్ మాటలకు తాము సిద్ధంగా ఉన్నామని వేదిక మీరు చెబుతారా.. మమ్మల్ని చెప్పమంటారా.. అంటూ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్ర బోస్ సమాధానం ఇచ్చారు. రామచంద్రపురం ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ మంత్రి చేసిన వ్యాఖ్యలపై బోస్ మండిపడ్డారు. ప్రభుత్వంలో బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉన్న సుభాష్ గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో అవినీతి జరిగి ఉంటే సాక్ష్యాధారాలతో సహా బయటపెట్టి చర్యలు తీసుకునేందుకు ఎటువంటి అభ్యంతరాలు లేవని బోస్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అవినీతి జరిగిందని నిరాధార ఆరోపణలు చేస్తూ మంత్రి సుభాష్ ఇప్పుడు అవినీతి అక్రమాలకు పాల్పడుతూ ఉంటే చూస్తూ ఊరుకుంటామని అనుకుంటే అది వట్టి భ్రమ మాత్రమే అన్నారు. నియోజకవర్గంలో మంత్రి, మంత్రి అనుచరులు చేస్తున్న అవినీతి కార్యక్రమాలు ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉన్నామన్నారు. రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో బీసీ మహిళా సర్పంచ్‌పై కేవలం కక్షపూరిత ధోరణితో మంత్రి సుభాష్ పోలీస్ కేస్ బనాయించారన్నారు. గతంలో ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని పరిపాలించిన పిల్లి అప్పారావు హయాంలో దాతలు ఇచ్చిన స్థలంలో కల్యాణ మండపాన్ని నిర్మిస్తే శిథిలావస్థకు చేరుకోవడంతో వైఎస్సార్ సీపీ హయాంలో మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ నిధులు కేటాయించి నిర్మాణం సాగించారన్నారు. అయితే తాను కూడా ఎంపీ నిధుల నుంచి రూ.25 లక్షలు కేటాయించగా ఆ పనులు కూడా జరుగుతున్నాయన్నారు. నిర్మాణంలో ఉండగానే కమ్యూనిటీ హాలును పంచాయతీకి ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. గ్రామంలో పెళ్లిళ్లు, శుభకార్యాల సమయంలో కొన్ని సంప్రదాయాలు కొనసాగుతాయని వాటికి విఘాతం కలిగించే విధంగా మంత్రి సుభాష్ వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. వెంకటాయపాలెం సర్పంచ్ యల్లమిల్లి సూర్యకుమారిపై మంత్రి సుభాష్ పెట్టించిన కేసుపై ఇప్పటికే జిల్లా ఎస్పీని కలవడం జరిగిందన్నారు. ఇప్పటికైనా వెంకటాయపాలెంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలు పూర్వాపరాలు తెలుసుకోకుండా ఈ విషయంలో ఎటువంటి సంబంధం లేని సర్పంచ్ సతీష్‌కుమారిపై పెట్టిన తప్పుడు కేసు ఉపసంహరించుకోవాలని హితవు పలికారు.

అవినీతి ఆరోపణలు నిరూపించండి.. రాజీనామా చేస్తా: సర్పంచ్ సతీష్‌కుమారి

వెంకటాయపాలెంలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాలును వివాహ శుభ కార్యక్రమానికి రూ.20 వేలు తీసుకుని తాను అవినీతికి పాల్పడినట్టు మంత్రి సుభాష్ చేసిన ఆరోపణలను నిరూపిస్తే తన సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తానని వెంకటాయపాలెం సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి సవాల్ చేశారు. అర్థం లేని, ఆధారాలు లేని ఆరోపణలు చేయడం, కేసులు నమోదు చేయించడం మంత్రి సుభాష్‌కు తగదని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్, రామచంద్రపురం మండల ఎంపీపీ అంబటి భవాని, వాసంశెట్టి శ్యామ్ పాల్గొన్నారు.

‘మంతెన’కు పట్టాభిరామయ్య పరామర్శ



వెంకట రామలక్ష్మి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న పట్టాభిరామయ్య చౌదరి తదితరులు

రాయవరం: భార్య వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నేత మంతెన అచ్యుతరామరాజును ఆ పార్టీ సీనియర్ నాయకుడు వేగుళ్ల పట్టాభిరామయ్యచౌదరి ఆదివారం పరామర్శించారు. ఈ నెల 21న అచ్యుతరామరాజు సతీమణి వెంకటరామలక్ష్మి మృతి చెందగా, భౌతిక కాయాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనార్థం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రికి అప్పగించారు. అచ్యుతరామరాజును పట్టాభిరామయ్యచౌదరి పరామర్శించి, వెంకటరామలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించారు. పట్టాభిరామయ్యచౌదరితో పాటుగా వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి, పారిశ్రామికవేత్త సత్తి వెంకట సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ వెలగల సత్యనారాయణరెడ్డి, బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ జిల్లా చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి, మండపేట ఏఎంసీ మాజీ చైర్మన్ నక్కా సింహాచలం తదితరులు నివాళులర్పించారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి




ప్రమాదకరంగా ఉన్న వంతెన

కె.గంగవరం: అసలే ఏటిగట్టు ఇరుకుగా ఉంటుంది. దీనిపై ఉన్న వంతెన మరీ ఇరుకు. దీనికి తోడు వంతెనకు ఇరువైపులా మలుపులతో ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు అంటున్నారు. మండలంలోని కోటిపల్లి–కోట ఏటిగట్టుపై ఉన్న ఈ వంతెన వద్ద గత రెండు నెలల కాలంలో పలువురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలయ్యారని స్థానికులు చెబుతున్నారు. కనీసం ఈ వంతెన వద్ద ఆర్అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనకు ఇరువైపులా స్పీడుబ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

దాళ్వా సాగుకు రైతులు చొరవ చూపాలి

కాజులూరు: దాళ్వా సాగుకు రైతులు చొరవ చూపాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ నీటిపారుదల శాఖాధికారులు ఈ ఎడాది మార్చి 31 నాటికి గోదావరి డెల్టా కాలువలకు నీరు నిలుపుదల చేసే అవకాశం ఉందన్నారు. అయితే ఈ ఏడాది మండల గ్రామాల్లో తొలకరి మాసూళ్ల పనుల్లో తీవ్ర జాప్యం జరగడంతో దాళ్వా వరినాట్లు ఆలస్యమవుతుందని కనీసం డిసెంబరు నెలాఖరునాటికైనా మండలంలో పూర్తి స్థాయిలో వెదచల్లికలు, నాట్లు పూర్తి చేయాలన్నారు. లేకుంటే దాళ్వా పంట చివరి దశలో సాగునీరు అందని పరిస్థితులు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో తణుకువాడ పీఏసీఎస్ మాజీ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం మాజీ ఉపాధ్యక్షులు తాడి వెంకటరెడ్డి, రైతులు కర్రి రామకృష్ణారెడ్డి, నున్న గోవిందురాజులు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో కరెంట్ వైర్ల చోరీ



బాక్సులు పీకేసి వైరింగ్ కట్ చేసిన దృశ్యం



తాళం పగులగొట్టిన ఇల్లు

మండపేట: స్థానిక గొల్లపుంత రోడ్డులోని టిడ్కో కాలనీలో కరెంటు వైర్ల చోరీ జరిగింది. కాలనీలోని రూ.లక్ష ఫ్లాట్ల సి బ్లాక్‌లో ఈ చోరీ జరిగింది. దుండగులు రాత్రి వేళల్లో ఈ బ్లాక్‌లోని ఫ్లాట్లలోకి చొరబడి ఇన్స్‌లేషన్ చేసి ఉన్న వైర్లను మొత్తం పీక్కుని పట్టుకుపోయారు. ఈ బ్లాక్‌లోని పదికి పైగా ఇళ్ల తాళాలు, గెడలు కూడా బద్దలు కొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. రాత్రి అయితే చాలు ఈ ప్రాంతంలో గుంపులుగుంపులుగా యువకులు హల్‌చల్ చేస్తున్నారంటూ స్థానికులు భయాందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నించిన వారిపై గొడవపడి కొట్టడానికి కూడా వెనకాడడం లేదని చెబుతున్నారు. నాలుగు రోజులు క్రితం ఆ బ్లాకుల వైపుగా నలుగురు కుర్రాళ్లు తిరగడాన్ని చూసి ఎవరు బాబూ అని ప్రశ్నించగా ఫ్లాట్లలో అద్దెకుంటున్న వారమని చెప్పి తప్పించుకున్నట్టు తెలిపారు. కాగా కాలనీలో ఇళ్లు చాలావరకూ ఖాళీగా ఉండడంతో కొంతమంది యువకులు ఆ ఇళ్లను అద్దెకు తీసుకుని అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్టు తెలిసింది. అయితే పోలీసులు రోజూ ఈ కాలనీలో రెండుమూడు సార్లు రౌండ్స్ వేస్తూ పహరా కాస్తున్నారు. పోలీసు జీపు వచ్చినపుడు దుండగులు చడీచప్పుడు కాకుండా ఉండి అనంతరం చట్టవ్యతిరేక పనులకు పాల్పడుతున్నారు. నిఘా మరింత పెంచి ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

గోదారిగట్టు.. ప్రమాదాలకు మెట్టు








తాతపూడి- కపిలేశ్వరపురం గ్రామాల మధ్య ఛిద్రమైన రోడ్డు దృశ్యాలు

- తాతపూడి నుంచి వాకతిప్ప వరకూ ఛిద్రం
- పట్టించుకోని కూటమి పాలకులు

కపిలేశ్వరపురం: గోదారి గట్టు అనగానే ఆహ్లాదకరమైన వాతావరణంలో సంచరించవచ్చన్న భావన కలుగుతుంది. ఒకప్పుడు అదంతా ఓకే. కానీ పాలన మారింది. కూటమి పాలనలో ఆహ్లాదమూ, ఆనందమూ కానరాని పరిస్థితులు క్రమంగా నెలకొంటున్నాయి. ఒక పక్క పేదల సంక్షేమం కనుమరుగవుతుండగా గ్రామాల్లో రహదారులు సైతం ఛిద్రమై దర్శనమిస్తున్నాయి. ఆలమూరు మండలం జొన్నాడ నుంచి యానాం వరకూ గౌతమి గోదావరి గట్టు అనేక చోట్ల ఛిద్రమైంది. ప్రయాణికులు అటుగా వెళ్లేందుకు బెంబేలెత్తిపోతున్నారు. దానికితోడు ఇసుక లారీల జోరు తోడైంది. గోదావరి నదిలో తోడేస్తున్న ఇసుకను భారీ వాహనాల్లో సుదూర ప్రాంతాలకు తరలించేస్తున్నారు. రహదారులు ఏమయిపోతాయన్న ఆలోచన ఏమాత్రమూ పాలకులకు లేకపోయింది. వారి నీడన మసలుతున్న అధికారులు సైతం అదే దారిలో నడుస్తున్నారు.

కమ్మ మహాజన సంఘం ఉపాధ్యక్షుడిగా పాపారావు



వంటిపల్లి పాపారావు

ఆలమూరు: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమ్మ మహాజన సంఘం ఉపాధ్యక్షుడిగా ఆలమూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, మురళీకృష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల కాకినాడలోని కంటిపూడి సుబ్బమ్మ కల్యాణ మండపంలో ఆదివారం ఉమ్మడి జిల్లా కమ్మ మహాజన సంఘం సమావేశం జరిగింది. అందులో భాగంగా మూడు జిల్లాలకు చెందిన సహచర సభ్యులు పాపారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి అనేక మంది ఉపాధ్యక్షుడిగా ఎంపికైన పాపారావును పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: స్థానికి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదానానికి రాజమహేంద్రవరానికి చెందిన పరిమి వెంకట నాగరత్నం కుటుంబ సభ్యులు ఆదివారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ఈఓ, ఏసీ ముదునూరి సత్యనారాయణరాజుకు అందజేశారు. దాతను ఆలయ అర్చకులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది అభినందించారు.